సాక్షి నంద్యాల
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల అన్నప్రసాద వితరణకు శనివారం హైదరాబాద్‌కు చెందిన ఎం.కరుణకుమార్ రూ.1,11,001 విరాళాన్ని అందజేశారు. దాతకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



ఒకేరోజు రూ.3.81లక్షల ఆదాయం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి శ్రావణమాస నాలుగో శనివారం సందర్భంగా ఒకే రోజు రూ.3,81,411 ఆదాయం సమకూరింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.43
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 97.543
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 42,142
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:10,067

న్యూస్‌రీల్

జీఎన్‌ఎస్‌ఎస్‌కు నీటి విడుదల పెంపు

బనగానపల్లె: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ (గాలేరి నగరి సుజల స్రవంతి) కాల్వకు నీటి విడుదలను పెంచారు. అధికారులు గత 20 రోజులుగా 11 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ప్రస్తుతం నీటి విడుదలను 15 వేల క్యూసెక్కులకు పెంచారు. ఈ నీరు అవుకు రిజర్వాయర్‌కు చేరి అక్కడి నుంచి వైఎస్సార్ జిల్లాలోని గండికోట మైలవరం ప్రాజెక్టు తరలించనున్నారు.

నేటి నుంచి 'స్వచ్ఛ పఖ్వాడ'

నంద్యాల(న్యూటౌన్): పరిశుభ్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ పఖ్వాడ కార్యక్రమాన్ని ఆదివారం నుంచి జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించనున్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులతో కలిసి విద్యార్థులు, గ్రామస్తులు అవగాహన కల్పించనున్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛత గురించి పిల్లలకు తెలిపి ప్రతిజ్ఞ చేయించేందుకు స్వచ్ఛత శపథ్ దినం నిర్వహిస్తారు. ముగింపులో భాగంగా 15వ తేదీన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారని డీఈఓ సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు.

రూ.3కోట్ల అప్పుతో శనగల వ్యాపారి పరారీ

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేటకు చెందిన ఫర్టిలైజర్, శనగల వ్యాపారి రూ.3కోట్లకు పైగా అప్పులు చేసి పరారయ్యాడు. ఆరు రోజుల క్రితం గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లో వస్తువులు, కుటుంబ సభ్యులతో కలిసి తాళం వేసి పరారయ్యాడు. ఇతను స్థానికంగా సుమారు 20 ఏళ్ల క్రితం ఫర్టిలైజర్ దుకాణం ఏర్పాటు చేసి ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తుండేవాడు. చుట్టుపక్క గ్రామాల రైతులతో పరిచయాలు బాగా పెంచుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత శనగల వ్యాపారం ప్రారంభించాడు. ఈకోవలోనే ఏడాది క్రితం మీర్జాపురం, బెలుం శింగవరం, నాగిశెట్టిపల్లె, కల్వటాల, నందిపాడు, తిమ్మనాయినపేటతో పాటు అనంతపురం జిల్లా గుడిపాడుకు చెందిన రైతుల నుంచి పెద్ద మొత్తంలో శనగలు కొనుగోలు చేశాడు. గ్రామ సమీపంలో ఉన్న వేర్‌హౌస్‌లో 40 లారీలకు పైగానే శనగ బస్తాలను గుట్టు చప్పుడు కాకుండా విడతల వారీగా విక్రయించాడు. శనగలు విక్రయించిన రైతులకు అప్పు ఉన్నట్లు ప్రామిసరీ నోట్లు రాసిచ్చాడు. మరికొంత మందికి తెల్లకాగితాలపై లెక్కలు వేసి బకాయి ఉన్నట్లు చూపించాడు. ఫర్టిలైజర్ దుకాణానికి తోడు ఐదారు లారీలు కొనుగోలు చేశాడు. గ్రామంలోనే రూ.30 లక్షలు ఖర్చు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. కొద్ది రోజుల నుంచి రైతులు తమ పిల్లల చదువులకు ఫీజులు, పెళ్లిళ్ల ఇతర అవసరాలకు డబ్బు అవసరం పడటంతో వ్యాపారి ఇంటి వద్దకు తిరుగుతూ వచ్చారు. వచ్చిన వారందరికీ గడువు చెప్పి పంపేవాడు. రోజు రోజుకు రైతుల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో గుట్టు చప్పుడు కాకుండా కుటుంబంతో సహా ఊరు విడిచి పరారయ్యాడు. ఒక్క మీర్జాపురం నుంచే రూ.70 లక్షల వరకు రైతులకు ఇవ్వాల్సి ఉండగా మొత్తంగా రూ.3కోట్లకు పైగానే బకాయిలు ఉన్నట్లు తెలుస్తుంది.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ

నంద్యాల(అర్బన్): రేషన్ కార్డు దారులందరికీ ఉచితంగా బియ్యం, సబ్సిడీ ధరపై చక్కెర ఎండీయూ వాహనాల ద్వారా ఆదివారం నుంచి ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నారని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ శనివారం ఒక ప్రటనలో తెలిపారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులందరికీ బియ్యం బదులుగా 3 కేజీల జొన్నలను పంపిణీ చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కష్టం కౌలు రైతులది.. ప్రతిఫలం పచ్చనేతలది

కౌలు రైతులకు మేలు చేస్తామంటూ ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం క్రాప్ కల్టీవేటర్ రైట్ (సీసీఆర్) కార్డుల పంపిణీ పేరుతో హడావుడి చేస్తోంది. మరో వైపు కౌలు రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను దోచుకునేందుకు అధికార పార్టీ నేతలు అంతా సిద్ధం చేసుకుంటున్నారు. అర్హులకు సీసీఆర్ కార్డులు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారు. గ్రామాల్లో తాము చెప్పిన వారికే సీసీఆర్‌సీలు ఇవ్వాలని పచ్చ నేతలు హుకుం జారీ చేస్తున్నారు. కొందరు తమ బంధువులు, ఇళ్లలో పని చేసే వారి పేర్ల మీద కార్డులు సృష్టిస్తున్నారు. దిక్కుతోచని కౌలు రైతులు వ్యవసాయానికి దూరం అవుతుండగా మరి కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

- నిజమైన కౌలుదారులకు అందని కౌలు కార్డులు
- బంధువులు, తమ ఇళ్లలో పని చేసే వారికి ఇప్పిస్తున్న టీడీపీ నేతలు
- ప్రభుత్వ సంక్షేమ ఫలాలు కాజేసేందుకు యత్నం
- వడ్డీ వ్యాపారుల చుట్టూ కౌలుదారుల ప్రదక్షిణలు

ఆళ్లగడ్డ: కౌలు రైతులకు ధ్రువీకరణ పత్రం ఎంతో విలువైనది. ఈ కార్డు ఉంటే ఎరువులు, విత్తనాలు రాయితీపై లభిస్తాయి. బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి. విపత్తుల సమయంలో పంట నష్ట పరిహారం అందుతుంది. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి భరోసాకు ఈ కార్డే అత్యంత ఆధారం. ఇంతటి ప్రాధాన్యమున్న సీసీఆర్ కార్డుల జారీలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో కౌలుదారులను ఆందోళనకు, ఆవేదనకు గురి చేస్తోంది. ఎన్నికల సమయంలో కూటమి మేనిఫెస్టోలో కౌలు రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే సీసీఆర్ కార్డుల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఈ సాయాన్ని కాజేసేందుకు టీడీపీ నేతలు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అర్హులకు కార్డులు ఇవ్వకుండా వ్యవసాయాధికారులపై ఒత్తిడి చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయంలో సీసీఆర్సీల జారీ సజావుగా సాగినా.. ఈ ఏడాది పెద్ద ఎత్తున అవకతవకలు చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ కింద అందజేయనున్న రూ. 20 వేలతో పాటు ఇతర సంక్షేమ పథకాలు కాజేయడమే లక్ష్యంగా కౌలు కార్డులను దర్జాగా కాజేస్తున్నారు. ఇంతవరకు వ్యవసాయమే తెలియని కొందరు కార్డులు పొందగా మరి కొందరు టీడీపీ నేతలు తమ ఇళ్లలో పనిచేసే వారు, బంధువుల పేరిట దొంగ సీసీఆర్ కార్డులు పొందినట్లు గ్రామాల్లో చర్చించుకుంటున్నారు.

అధికారుల మధ్య సమన్వయం లోపం..

వ్యవసాయ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో సీసీఆర్ కార్డుల పంపిణీ నత్తనడకన సాగుతోంది. ఈ వ్యవసాయ సంవత్సరానికి సంబంధించి సుమారు 28 వేల మంది కౌలు దారులకు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 21,935 మందికి మాత్రమే పంపిణీ చేశారు. ఇందులో కూడా సగానికి పైగా టీడీపీ నాయకులు తమ బినామీలకు కౌలుకు ఇచ్చినట్లు కార్డులు రాయించినట్లు తెలుస్తోంది. గత సంవత్సరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీసీఆర్‌సీలు పొందిన 22 వేల మంది కౌలు దారుల్లో 10,837 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాగుదారులున్నారు. ఇందులో 9,432 మంది ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తించారు. ఈ 9,432 మందికి రూ.13,500 చొప్పున ప్రభుత్వం మొత్తం రూ. 12.73 కోట్లు వైఎస్సార్ రైతు భరోసా సొమ్ము జమ చేసింది.

కౌలు రైతు ఆత్మహత్య

- అప్పుల బాధ తాళలేక బలవన్మరణం



రామానాయుడు (ఫైల్)

కోవెలకుంట్ల: వ్యవసాయం కోసం చేసిన అప్పులు ఓ నిండు ప్రాణం బలి తీసుకున్నాయి. కోవెలకుంట్ల మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన ఓ కౌలు రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన రామానాయుడు(40) గ్రామంలో రైతుల పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని ఐదు ఎకరాల్లో మొక్కజొన్న, మరో ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాడు. వాతావరణం అనుకూలించకపోవడంతో గతంలో దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి. రెండేళ్లగా పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ. 18 లక్షల వరకు అప్పులు చేశాడు. తీసుకున్న అప్పు చెల్లించాలని ఒత్తిడి అధికం కావడంతో మనస్తాపానికి గురై శుక్రవారం క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కౌలు రైతు ఆత్మహత్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భూపాలుడు శనివారం తెలిపారు.

రుణం అందక.. సాగు సాగక..

సుమారు మూడు నెలల నుంచి సీసీఆర్ కార్డుల పంపిణీని అధికారులు సాగదీస్తున్నారు. మరో నెల లోపు సీజన్ ముగిసిపోనుంది. గడవు దాటాక కార్డులు ఇచ్చినా ప్రయోజనం ఏమిటి అని కౌలు రైతులు వాపోతున్నారు. కార్డులు అందకపోతే ప్రభుతం నుంచి అందాల్సిన రాయితీలు అందవన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఊదరగొట్టారు. అవన్నీ అమలు చేయకపోయినా ప్రస్తుతం కౌలు కార్డు మంజూరు చేసినా బ్యాంకు రుణం తీసుకుందామంటే అవి కూడా తమ నేతలు చెప్పిన వారికే ఇస్తుండటంతో కౌలు రైతులకు దిక్కుతోచడం లేదు. ఇటు సాయం అందక.. అటు అప్పు పుట్టక ఆందోళన చెందుతున్నారు. సకాలంలో రైతులకు రుణాలు అందకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో జిల్లాలో మూడు నెలల వ్యవధిలో ఏడుగురు కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారిలో ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోనే ఐదుగురు ఉన్నారు.

సీసీఆర్ కార్డులు పంపిణీ ఇలా..

సబ్‌డివిజన్	లక్ష్యం	పంపిణీ
బనగానపల్లె	7,894	6,007
నందికొట్కూరు	4,129	3,187
ఆళ్లగడ్డ	5,586	4,178
కోవెలకుంట్ల	6,065	4,839
డోన్	1,283	1,168
ఆత్మకూరు	2,823	2,556

గత ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగింది



నాకు సెంటు కూడా భూమి లేదు. పది సంవత్సరాలుగా రైతుల పొలాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాను. గతేడాది గ్రామంలోని చిన్నపుల్లమ్మ దగ్గర 2 ఎకరాలు కౌలు తీసుకుని వరి నాటాను. పంట తీవ్రంగా దెబ్బతిని నష్టపోయాను. అయినా అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధారణ రైతులతో పాటు నాకు రూ. 39 వేలు ఉచిత పంటల బీమా, రూ. 9 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చింది. అలాగే ఏటా రూ. 13,500 రైతు భరోసా జమ చేసింది. ఈ ఏడాది కౌలు కార్డు మాత్రం ఇంకా ఇవ్వలేదు.

– జర్రగాళ్ల పాములేటి, కౌలురైతు, బాచేపల్లి

ఇప్పుడు ఇచ్చినా ఏం ఉపయోగం



నేను ఏటా సుమారు 5 ఎకరాల మేర పొలం కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తుంటాను. గత నాలుగు సంవత్సరాలు జూన్ నెలలోనే కౌలు కార్డులు ఇవ్వడంతో బ్యాంకులో పంట రుణం తోపాటు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రాయితీలు పొందడం జరిగింది. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు కౌలు కార్డు ఇవ్వలేదు. సెప్టెంబర్ నెల వచ్చింది.. ఇప్పుడు ఇచ్చినా ఏం ప్రయోజనముంటుంది.

– ఉడుత శ్రీనివాసులు, గంగవరం, శిరివెళ్ల మండలం



చాగలమర్రి మండలం రాజోలి ఆనకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది



శ్రీశైల క్షేత్రంలో ఇళ్ల మధ్య వర్షపు నీరు పరవళ్లు

ఎడతెరిపి లేని వాన

- తుపాన్ ప్రభావంతో జిల్లాలో మోస్తరు వర్షం
- శ్రీశైలంలో అత్యధికంగా 66.4 మి.మీ

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఎడతెరపి లేని వానలతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం మొదలైన వర్షం శనివారం రాత్రి వరకు కూడా పడుతూనే ఉంది. శ్రీశైలంలో అత్యధికంగా 66.4మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కొలిమిగుండ్ల మండలంలో 2.4 మి.మీ వర్షం కురిసింది. నందికొట్కూరులో 54.2, రుద్రవరం 40.2, జూపాడుబంగ్లా 39.6, నంద్యాల 30.2, బనగానపల్లె 22.8, డోన్ 22.2 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో పొలాల్లో నీరు నిలిచాయి. వాగులు, వంకలు ఉప్పొంగడంతో లోతట్టు వంతెనల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాగలమర్రి మండలం నేలంపాడు గ్రామంలో ఎస్సీ కాలనీలో బొల్లు భూషణానికి చెందిన పాత మిద్దె కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. తుపాన్ ప్రభావంతో మరో మూడు రోజుల పాటు వర్షాలు పడే సూచనలు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పైరు నీట మునిగి కుళ్లిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.



నేలంపాడు గ్రామంలో వర్షానికి కూలిన మట్టిమిద్దె

➤ మహానంది మండలంలో పాలేరు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వాహనదారులు వెళ్లకుండా పోలీసులు కాపలా ఉన్నారు.

➤ నంద్యాల పట్టణం సమీపంలో మద్దిలేరు వాగు మీదుగా వెళ్లే వాహనాలను నిలిపి వేశారు. భీమవరం, ఎర్రగుంట్ల, పెసరవాయి, కరిమద్దెల, తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి.

➤ శ్రీశైలంలో కురిసిన భారీ వర్షాలకు నివాస ఇళ్లలోకి నీరు వచ్చి చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

➤ ఆత్మకూరు పట్టణంలో భారీ వృక్షం నేలకూలింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మరో మూడు రోజుల పాటు వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టళ్లు, పాఠశాల భవనాల కింద విద్యార్థులు ఎవరూ నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నదీ పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఏమైనా ఇబ్బందులు వస్తే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08514-293903కు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

'ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ' మాటల్లోనే!

నంద్యాల(న్యూటౌన్): ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ అభాసుపాలవుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులతో పింఛన్‌దారులకు ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా అది కేవలం 20 నుంచి 30 శాతానికే పరిమితమవుతోంది. 70 శాతం పింఛన్ల పంపిణీ గ్రామ, వార్డు సచివాలయాలు, రచ్చబండలు, ప్రధాన కూడళ్లలోనే జరుగుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఓర్వకల్లులో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో పాల్గొనాల్సి ఉండగా వర్షాల కారణంగా కార్యక్రమం రద్దయింది. మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ నంద్యాల పట్టణం 27వ వార్డులో, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేటలో, నంద్యాల మండలం కొత్తపల్లె, బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరులో కలెక్టర్ రాజకుమారి పింఛన్లు పంపిణీ చేశారు. చాలా చోట్ల ఏకంగా టీడీపీ నేతలు పింఛన్లు పంపిణీ చేయడం పట్ల సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. నంద్యాల జిల్లాలో 2,19,046 పింఛన్లు ఉండగా, శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 2,07,003 పింఛన్లు పంపిణీ చేశారు. 94.5 శాతం పంపిణీ పూర్తయ్యింది. పంపిణీలో నంద్యాల జిల్లాకు రాష్ట్రంలో 17వ స్థానంలో నిలిచింది.



కొలిమిగుండ్ల సచివాలయంలో పింఛన్ లబ్ధిదారులు


అడ్మిషన్లు మరింత పెంచాలి

- ఆర్‌జేడీ నాగలింగారెడ్డి

శిరివెళ్ల: కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని ఆర్‌జేడీ నాగలింగారెడ్డి అన్నారు. శనివారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాలను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంపై ఆరా తీయగా వర్షాల కారణంగా హాజరు కాలేదని అధ్యాపకులు వివరించారు. అనంతరం కళాశాల రికార్డులను పరిశీలించారు. హాజరు రిజిస్టర్ తరగతి గదిలోనే ఉండాలని సూచించారు. గ్రామీణ విద్యార్థుల సౌకర్యం ఏర్పాటు చేసిన కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలో ఉత్తీర్ణత శాతం, ప్రభుత్వం కల్పించే వసతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ ఏడాది నుంచి కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరైందని, ఎంత మంది విద్యార్థులు చేరానని ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డిని ఆరా తీశారు. ఎన్‌సీసీలో చేరితే కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించాలన్నారు.

సర్దుబాటు గందరగోళం

- ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తయ్యేదెన్నడో
- ఎస్‌జీటీలతో బలవంతపు సర్దుబాటు
- ప్రాథమిక పాఠశాలకు శాపంగా మారిన ప్రక్రియ
- ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగే అవకాశం



నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అంతా గందరగోళంగా మారింది. ఈ వ్యవహారం గోప్యంగా సాగుతుండంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్దుబాటు వివరాలు వెల్లడించడంలో అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 1,358 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కూళ్లలో 1.52 లక్షల మంది విద్యార్థులు ఉండగా వీరికి 6,600 మంది ఉపాధ్యాయులు చదువు చెబుతున్నారు. కాగా జిల్లాలో ఇప్పటికీ 325 మంది స్కూల్ అసిస్టెంట్‌లు అవసరం కాగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా ఎస్‌జీటీలతో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఖాళీ అయ్యే ఎస్‌జీటీల స్థానంలో విద్యా వలంటీర్లను తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆగస్టు 8వ తేదీ నుంచి ప్రారంభమైన సర్దుబాటు ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ముక్కుతూ మూలుగుతూ మండల స్థాయి సర్దుబాటును పూర్తి చేశారు. ఈ ప్రక్రియ వారాల తరబడి సాగుతుండటంతో పాఠశాలల్లో బోధన గాలిలో దీపంలా మారింది. సర్దుబాటులో ఏ పాఠశాలకు పోవాల్సి వస్తుందోనన్న ఆందోళనతో ఉపాధ్యాయులు బోధనపై మనసును నిమగ్నం చేయలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు సర్దుబాటు ప్రక్రియ ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారనుంది. మళ్లీ ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరగనుంది. గతంలో ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి సర్దుబాటు చేశారు, కానీ మళ్లీ మెథడాలజీ ఉన్న ఎస్‌జీటీలకు బలవంతంగా సబ్జెక్టు టీచర్లుగా సర్దుబాటు చేస్తున్నారు. ఇది విల్లింగ్ లేని ఎస్‌జీటీలకు తలనొప్పిగా మారింది. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనలో ఎస్‌జీటీలు..

పాఠశాలలు ప్రారంభమైన మూడు నెలల తరువాత ఈ సర్దుబాటు ప్రక్రియ చేపట్టడంపై మేధావులు, విద్యావంతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 117 జీవో ప్రకారం జిల్లాలోని డోన్, నంద్యాల, ఆత్మకూరు డివిజన్లలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జరుగుతోంది. సబ్జెక్టు టీచర్లు మిగులుగా ఉన్న వారిని అవసరమైన పాఠశాలకు సర్దుబాటు చేస్తే సరిపోతుంది. కానీ ఇక్కడే అసలైన లోగుట్టు ఉంది. సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ)ను వారి సబ్జెక్టు మెథడాలజీని బట్టి ఉన్నత పాఠశాలలకు కేటాయించడంతో పాటు బలవంతంగా హైస్కూళ్లకు సబ్జెక్టు టీచర్లుగా వెళ్లాలని ఆదేశించారు. దీంతో వారిలో గుబులు మొదలైంది. ఎందుకంటే గతేడాది ఎస్‌జీటీలకు పదోన్నతులు జరిగాయి. విల్లింగ్ ఉన్న ప్రతి ఎస్‌జీటీలు పదోన్నతిపై వెళ్లారు. ప్రస్తుతం పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలు వివిధ వ్యక్తిగత కారణాలతో పదోన్నతులు వదులుకుని ఉన్న స్కూళ్లలోనే ఎస్‌జీటీలుగానే కొనసాగుతున్నారు. కానీ అప్పుడు పదోన్నతులు వదులుకుని ఎస్‌జీటీలుగా కొనసాగుతున్న వారిని మళ్లీ ఉన్న ఫలంగా సబ్జెక్టు ఉపాధ్యాయులుగా హైస్కూళ్లకు వెళ్లాల్సిందేనని ఆదేశించడం సబబుగా లేదని పలువురు విమర్శిస్తున్నారు.

పది ఫలితాలపై ప్రభావం...

పదోన్నతులు వద్దు అనుకుని గతంలో ఎస్‌జీటీలుగా కొనసాగుతున్న వారికి సబ్జెక్టు టీచర్లకు నియమిస్తే దాని ప్రభావం పదవ తరగతి ఫలితాలపై చూపుతుందని పలువురు విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై ఇప్పటికే మూడు నెలలు గడుస్తున్నాయి. విద్యార్థులంతా ఆయా సబ్జెక్టు టీచర్లకు అలవాటు పడి ఉంటారు. ఉన్నట్లుండి.. వారిని వేరే చోటికి సర్దుబాటు చేయడం సరైంది కాదని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులను ఉన్నఫలంగా బలవంతంగా సర్దుబాటు చేస్తే ప్రస్తుత పాఠశాలలో బోధన ప్రశ్నార్థకంగా మారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పని చేసే మండలంలో కాకుండా..

కొంతమంది ఎస్‌జీటీలను వారు పనిచేస్తున్న మండలంలోనే ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు సర్దుబాటు చేయకుండా మెథడాలజీ సబ్జెక్టు ఉన్న ఎస్‌జీటీలందరినీ జిల్లాస్థాయిలో ఖాళీలు ఉన్న హైస్కూళ్లలో నియమిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 98 మంది కంటే తక్కువగా విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్ల తరలింపుతో అక్కడ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉంది. దీంతో పాటు ఎస్‌జీటీలను హైస్కూల్‌కు తరలింపుతో టీచర్లు లేని ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న ఖాళీలు ఎలా పూరిస్తారోననే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పాటు చాలా ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రహసనంగా మారింది



రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు విధానాన్ని ప్రహసనంగా మార్చేసింది. పని సర్దుబాటు వల్ల పాఠశాలలు నష్టపోకుండా చూడాలి. రాష్ట్ర ప్రభుత్వం 117 జీఓ ద్వారా సర్దుబాటు చేపడుతుండటంతో ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు సర్‌ప్లస్ అవుతున్నారు. దీనివల్ల ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

– సుబ్బన్న, నంద్యాల జిల్లా ఫ్యాప్టో చైర్మన్, నంద్యాల

బలవంతపు సర్దుబాట్లు వద్దు



ఉన్నత పాఠశాలల్లో ఉన్న ఖాళీల మేరకు పదోన్నతులు చేపట్టాలి. బలవంతంగా ఎస్‌జీటీ ఉపాధ్యాయులను సబ్జెక్టు మెథడాలజీ నెపంతో సర్దుబాటు చేయడం సబబుకాదు. వెంటనే పదోన్నతులు నిర్వహించాలి. ఎన్నికల హామీ మేరకు డీఎస్సీని వెంటనే చేపట్టి ఖాళీల భర్తీ చేస్తే బాగుంటుంది.

– నగరి శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి, నంద్యాల

ఉపాధ్యాయ పోస్టులను కుదించ వద్దు



సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను కుదించి ఖర్చు తగ్గించాలని చూడటం సరికాదు. అది విద్యా ప్రమాణాలకు ముప్పు. ప్రాథమిక విద్యలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. అలాగే ఉన్నత తరగతులలో కూడా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:40గా ఉండాలి. అలాంటప్పుడే విద్యా ప్రమాణాలు పెంపొందే వీలుంటుంది.

– శివయ్య, ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి, నంద్యాల

క్లుప్తంగా

శేషజీవితం సంతోషంగా గడపాలి



పదవీ విరమణ పొందిన ఏఎస్ఐలను సత్కరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: ఉద్యోగ విరమణ తర్వాత మిగిలిన జీవితాన్ని సంతోషంగా గడపాలని ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. కర్నూలు మూడో పట్టణ పీఎస్ ఏఎస్ఐ టి.దస్తగిరి సాహెబ్, కౌతాళం పీఎస్ ఏఎస్ఐ బి.సూర్యనారాయణరెడ్డి శనివారం పదవీ విరమణ పొందారు. వారిని క్యాంపు కార్యాలయానికి రప్పించి శాలువా, పూలమాలలతో ఎస్పీ సత్కరించారు. పదవీ విరమణ సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, ఆర్ఐ నారాయణ, ఎస్ఐ హనుమంతయ్య, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ డీఎస్పీ బదిలీ

కర్నూలు: కర్నూలు రేంజ్ ఇంటెలిజెన్స్ విభాగం డీఎస్పీ సీతారాంను బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. 1995లో ఎస్ఐ హోదాలో పోలీసు శాఖలో చేరిన సీతారాం కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పనిచేశారు. 2021లో డీఎస్పీగా పదోన్నతి పొంది ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తుండగా సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసి పోలీసు హెడ్ క్వార్టర్‌లో రిపోర్టు చేసుకోవలసిందిగా అందులో పేర్కొన్నారు. ఈయన కర్నూలు ఏసీబీ విభాగానికి నియమితులయ్యే అవకాశమున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో సీఐగా ఏసీబీలో సేవలందించారు. ఇక్కడ ఉన్న డీఎస్పీ వెంకటాద్రి ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత (మూడు మాసాల క్రితం) చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ స్థానం ఖాళీగా ఉంది. సీతారాంను ఈ పోస్టుకు నియమించే అవకాశమున్నట్లు సమాచారం. అలాగే ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న పవన్‌కిషోర్‌కు కూడా స్థానచలనం కలిగింది. ఈయనను కూడా వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన ఎక్కువకాలం లూప్‌లైన్ విభాగాల్లోనే పనిచేశారు.

తోటి విద్యార్థుల ఉదారత



చంద్రశేఖర్‌కు నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

ఆలూరు/ఆలూరు రూరల్: తండ్రి మృతి చెంది, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థికి ఆర్థిక సాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు అరికెర గురుకుల పాఠశాల విద్యార్థులు. ఆదోని మండలం మదిరే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అరికెర గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల తన తండ్రి సిద్దప్ప గుండెపోటుతో మృతిచెందాడు. తండ్రి అంత్యక్రియలు పూర్తి చేసి మూడు రోజుల క్రితం తిరిగి పాఠశాలకు వచ్చిన చంద్రశేఖర్.. ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను చదువు మానేయాల్సి వస్తుందని చెప్పి తోటి స్నేహితుల వద్ద బాధను వ్యక్తం చేశాడు. తోటి విద్యార్థులు తమ వంతుగా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకుని, ఇదే విషయాన్ని తమ క్లాస్ హౌస్ మాస్టర్లు నరసింహులు, శ్రీనివాసులుకు చెప్పారు. పోగుచేసిన రూ.5,500 నగదును ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా శనివారం విద్యార్థికి అందించి గొప్ప మనసు చాటుకున్నారు.

ప్రతినెలా పింఛన్ల ప్రచారమే!

ఏదో ఒక జిల్లాకు వెళ్లి ప్రచార ఆర్భాటం

- ముందుగా కర్నూలు జిల్లా పత్తికొండలో సీఎం పర్యటన
- వర్షం కారణంగా ఓర్వకల్లుకు మారుస్తూ రాత్రి నిర్ణయం
- నిద్రాహారాలు మాని ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఉదయం వర్షం కారణంగా పర్యటన రద్దంటూ ప్రకటన
- జర్నలిస్టులకు పాస్‌ల విషయంలోనూ వివక్ష



ఓర్వకల్‌లో ఏర్పాటు చేసిన సీఎం సభా ప్రాంగణం

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ప్రతినెలా పింఛన్లను కొత్తగా ప్రారంభిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. జూలైలో మంగళగిరి, ఆగస్టులో మడకశిర నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు స్వయంగా పర్యటించి పెన్షన్లను ఇంటింటా పంపిణీ చేశారు. సెప్టెంబర్ మాసానికి సంబంధించి శనివారం ఆయన కర్నూలు జిల్లా ఓర్వకల్ గ్రామ పంచాయతీలో పర్యటించి ఇంటింటా పెన్షన్లను పంపిణీ చేసి గ్రామస్తులతో ముఖాముఖి చేపట్టాల్సి ఉండగా వరుణుడు బ్రేక్ వేశాడు. భారీ వర్షాల కారణంగా సీఎంచంద్రబాబు పర్యటనను అర్థాంతరంగా రద్దు చేశారు.

అధికారుల అవస్థలు వర్ణనాతీతం

సీఎం చంద్రబాబు పత్తికొండ నియోజకవర్గంలోని పుచ్చకాయలమాడలో ఇంటింటా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని 30వ తేదీ ఉదయం జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది. దీంతో రెండు రోజుల్లో సీఎం పర్యటన కోసం అధికారులు రేయింబవళ్లు శ్రమించి ఏర్పాట్లను పూర్తి చేశారు. చివరకు శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో వర్షాల కారణంగా చంద్రబాబు పర్యటన రద్దయిందని, అయితే ఓర్వకల్ విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న ఓర్వకల్‌లోనే పెన్షన్ల పంపిణీలో పాల్గొంటారని, అక్కడే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీంతో పత్తికొండలో ఉన్న అధికారులు శుక్రవారం రాత్రి ఓర్వకల్‌కు వచ్చి ఏర్పాట్లపై పరిశీలన చేశారు. అప్పటికే జోరు వాన కురుస్తుండడంతో రాత్రంతా అక్కడే ఉండి పోవాల్సి వచ్చింది. ఏమీ చేయలేని పరిస్థితి. ఉదయాన కూడా జోరు వర్షం కురుస్తున్నా ఏర్పాట్లను చేపట్టారు. చివరకు 11 గంటల సమయంలో సీఎం పర్యటనను వర్షాల కారణంగా రద్దు చేసినట్లు ప్రకటించడంతో అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు.

కొన్ని మీడియా సంస్థలకే సీఎం సభకు పాసులు

సమాచార, పౌరసంబంధాల శాఖ సీఎం చంద్రబాబునాయుడు పాల్గొనే సభకు కొన్ని మీడియా సంస్థలకే పాసులను జారీ చేశారు. శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్‌లో జరిగే కార్యక్రమానికి టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ, సాక్షి టీవీ, పేపర్‌కు పాసులు ఇవ్వలేదు. ఆయా సంస్థలకు జిల్లా కలెక్టర్ జారీ చేసిన మీడియా అక్రిడిటేషన్ కార్డులు ఉన్నా పాసులు మాత్రం ఇవ్వలేదు. స్థానిక అధికారులను అడిగితే కమిషనర్ ఆదేశాల మేరకు ఇవ్వలేదని చెప్పడం గమనార్హం.

ప్రతి నెలా సూపర్ సిక్స్ పథకాలను ప్రారంభిస్తే మంచిది!

ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి పేదరికాన్ని నిర్మూలిస్తామని స్వయంగా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు టీడీపీ, జనసేన క్యాడర్ మొత్తం ప్రజలకు హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని పక్కనపెట్టి మిన్నకుండి పోయారు. ఖజానా ఖాళీ అంటూ కాలయాపన చేస్తున్నారు. మరోవైపు గతంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు హామీలు ఇచ్చే సమయంలో ఖజానా ఖాళీ వివరాలు తెలియవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాగా, సూపర్ సిక్స్‌లో పథకాలను ప్రతి నెలా ఒకదానిని ప్రారంభించి జిల్లాలకు వెళ్లితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



అందాల జలధార

యాగంటి క్షేత్రం ఆవరణలోని ఓ జలధార భక్తులు, పర్యాటకులను ఆకట్టుకుంటోంది. కొండ మధ్యలో నుంచి జలధార నేలను తాకుతున్న దృశ్యాలు చూస్తుంటే ఏదో సెట్టింగ్ వేశారా అన్నట్లుగా అనిపిస్తోంది. క్షేత్ర పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో నీటి ధార జలపాతంలా మారడంతో భక్తులు సెల్ఫీలు తీసుకుంటూ ఆనందిస్తున్నారు. – బనగానపల్లె రూరల్

గొడుగు కళ్లకు అడ్డుపడి..

- బైక్‌పై వెళ్తూ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీ
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మృతుడు సిద్దిఖ్

చాగలమర్రి: వైఎస్సార్ జిల్లా జొన్నవరం మెట్ట సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చాగలమర్రికి చెందిన ఓ స్వర్ణకారుడు దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రి పాత బస్టాండు వీధికి చెందిన మహమ్మద్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సిద్దిఖ్ స్వర్ణకారుడు. సొంత పనుల నిమిత్తం శుక్రవారం తన స్నేహితుడు తౌఫిక్‌తో కలసి బైక్‌పై వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని రాత్రి తిరిగి చాగలమర్రికి బయలుదేరారు. వర్షం కురుస్తుండటంతో వెనుక కూర్చున్న తౌఫిక్ గొడుగు పట్టుకున్నాడు. కాగా మార్గమధ్యలో జొన్నవరం మెట్ట సమీపంలో బైక్ నడుపుతున్న సిద్దిఖ్ కళ్లకు గొడుగు అడ్డుపడటం, ఆ వెంటనే ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సిద్దిఖ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో తౌఫిక్ గాయాలతో బయటపడ్డాడు. కేసు నమోదు చేసినట్లు దువ్వూరు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. స్వర్ణకారుడు సిద్దిఖ్ మృతికి సంతాపంగా శనివారం స్వచ్ఛందగా దుకాణాలను మూసి వేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అమీర్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ తెలిపారు.

రీచ్‌ల పేరుతో ప్రాణాలు తీయొద్దు

- మైనింగ్ అధికారులకు విన్నవించిన గుడికంబాలి గ్రామస్తులు



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

కౌతాళం: రీచ్‌లు ఏర్పాటు చేసి తమ పిల్లల ప్రాణాలు తీయొద్దని గుడికంబాలి గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. మండల పరిధిలోని గుడికంబాలి, మరళి, నదిచాగి గ్రామాల్లో జిల్లా కాలుష్య మండలి, మైనింగ్, పర్యావరణ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఇసుక రీచ్‌ల వల్ల ఉన్న ఇబ్బందులు తెలపాలని అధికారులు కోరగా గుడికంబాలి గ్రామస్తులు మాట్లాడుతూ ఇసుక లారీలు ఇష్టానుసారంగా రోడ్లపై రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతోపాటు దుమ్ము, దూళి వల్ల అనారోగ్యాలకు గురవుతున్నామని, రోడ్డు పక్కన ఉన్న పంట పొలాలు దిగుబడులు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలు తేలిన రోడ్లపై ప్రమాదాలకు గురవుతున్నా కాంట్రాక్టర్ గానీ, మైనింగ్ అధికారులు గానీ పరిహారం అందించకపోవడంతో పలు కుటుంబాలు వీధిన పడినట్లు వివరించారు. ఇసుక రీచ్‌ల వల్ల ప్రభుత్వానికి, కాంట్రాక్టర్‌కు లాభం తప్ప తమ గ్రామానికి ఎలాంటి ఉపయోగం లేకపోవడంతోపాటు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని బస్సు సర్వీసులు కూడా నిలిచిపోయాయని తెలిపారు. తమ పిల్లలు చదువుకునేందుకు హాల్వి గ్రామానికి రాకపోకలు సాగిస్తుంటారని, అదే సమయంలోనే మితిమీరిన వేగంతో ఇసుక లారీలు వెళ్తుంటాయని, ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు. అందరి అభిప్రాయాలను ఉన్నతాధికారులకు పంపుతామని, వారి ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లను ప్రారంభిస్తామని మైనింగ్ డీడీ రాజశేఖర్ తెలిపారు. సమావేశంలో ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ మునిప్రసాద్, జిల్లా ఇరిగేషన్ శాఖ ఈఈ శైలేశ్వరరావు, తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఆర్ఐ రాజశేఖర్‌గౌడ్, వీఆర్వో నాగార్జున, సర్పంచ్‌లు సిద్దేశ్, మల్లయ్య, మహేష్ ఉన్నారు.

ముగ్గురు దొంగల అరెస్ట్



దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యుగంధర్‌బాబు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని రెడ్డిస్‌కాలనీ, సాయిజిత్ కాలనీల్లోని రెండు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ యుగంధర్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. జూలై నెల 28వ తేదీన రెడ్డీస్‌కాలనీ, సాయిజిత్ కాలనీలో ఐదుగురు దొంగలు విలువైన బంగారు ఆభరణాలు, వస్తువులను దోచుకెళ్లారు. దొంగతనానికి పాల్పడిన వారిలో చిత్తూరు జిల్లాకు చెందిన హేమంత్, షేక్‌మస్తాన్, బెంగళూరుకు చెందిన పాల్‌రాజ్ ఆంటోనిని శుక్రవారం స్థానిక రైతునగరం సమీపంలో అరెస్ట్ చేశారు. వారి నుంచి పాస్‌పోర్ట్, రెండు సెల్ ఫోన్‌లు, రూ. 1.50 లక్షల నగదు, రెండు ఐపాడ్‌లు, 2 తులాల బంగారు గొలుసు, 5 గ్రాముల బంగారు ఉంగరం, 4 గ్రాములు కమ్మలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నామన్నారు. సమావేశంలో సీఐలు అస్రార్‌బాషా, సురేష్‌బాబు, నిరంజన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎస్ఐ గంగయ్యయాదవ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

క్వింటా పత్తి రూ.8 వేలు

ఆదోని రూరల్: స్థానిక వ్యవసాయమార్కెట్ యార్డులో శనివారం పత్తి క్వింటా రూ.8 వేలు పలికింది. గత వారంలో రూ.7,800 నుంచి రూ.7,950 వరకు పలికిన పత్తి ధర.. శుక్ర, శనివారాల్లో రూ.8 వేలకు చేరింది. యార్డుకు 585 క్వింటాళ్ల పత్తి రాగా గరిష్ఠ ధర రూ.8,015, మధ్య ధర రూ.7,449, కనిష్ఠ ధర రూ.4,211 నమోదైంది. వేరుశనగ కాయలు 2,290 క్వింటాళ్లు కాగా.. క్వింటా గరిష్ఠ ధర రూ.7,339, మధ్య ధర రూ.6,679, కనిష్ఠ ధర రూ.3,289 నమోదయ్యింది. ఆముదాలు 40 క్వింటాళ్లు రాగా క్వింటా గరిష్ఠ ధర రూ.5,713, మధ్య ధర రూ.5,560, కనిష్ఠ ధర రూ.4211 నమోదయ్యింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం




జయకుమార్, డేవిడ్ పాల్ (ఫైల్)



బైక్‌ను ఢీకొన్న లారీ

వెల్దుర్తి: మండల పరిధిలోని మదార్‌పురం గ్రామ సమీపంలో హైవే 44పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మృతదేహాలపై లారీ చక్రాలు ఎక్కడంతో కొన్ని అవయవాలు తెగిపడగా, మిగతా భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. డోన్‌లోని టీచర్స్ కాలనీకి చెందిన పాలెం జయకుమార్(49), పొట్టపాటి డేవిడ్ పాల్(50) స్నేహితులు. జయకుమార్ ఆర్‌అండ్‌బీలో ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తుండగా అతనికి పాల్ సహాయకుడిగా ఉండేవాడు. శనివారం ఇద్దరూ కలిసి బైక్‌పై వెల్దుర్తికి వెళ్లి అక్కడ పని ముగించుకుని డోన్‌కు తిరుగు పయనమయ్యారు. మదార్‌పురం దాటిన తర్వాత నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ వద్దకు రాగానే వెనుక నుంచి రాజస్తాన్‌కు చెందిన లారీ వీరి బైక్‌ను వేగంగా ఢీకొంది. కిందపడిన వీరిపై లారీ చక్రాలు ఎక్కడంతోపాటు బైక్‌ను కొంతదూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. డ్రైవర్ లారీని అక్కడే నిలిపి పరారయ్యాడు. జయకుమార్‌కు భార్య గౌరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పాల్‌కు పెళ్లి కాలేదు. హైవే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వెల్దుర్తి ఏఎస్ఐ శివరామిరెడ్డి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.



మీరు భద్రం పోలీసన్నో!

ఓర్వకల్లులో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. ముందుగా పత్తికొండ నియోజకవర్గంలో పర్యటన ఖరారైనప్పటికీ, వర్షాల కారణంగా ఓర్వకల్లుకు మార్పు చేశారు. దీంతో అధికార యంత్రాంగమంతా ఉరుకులు పరుగుల మీద రాత్రికి రాత్రి అక్కడికి చేరుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఓర్వకల్లు చేరుకునేందుకు ఎదుర్కొన్న అవస్థలు వర్ణనాతీతం. ఇద్దరు పోలీసులు ఓ మినీ ట్రక్కు వెనుక ప్రమాదకరంగా ఓర్వకల్లుకు చేరుకోవడం చూసి భద్రత కల్పించే వీళ్లకే ఇలాంటి పరిస్థితి వచ్చిందేంటని వాహన చోదకులు చర్చించుకోవడం కనిపించింది. అయితే ఎట్టకేలకు చంద్రబాబు పర్యటన రద్దయింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు